క్లుప్తంగా

రమాబాయి త్యాగం అజరామరం

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి త్యాగం అజరామరమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. రమాబాయి అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విజయాల వెనుక రమాబాయి కృషి మరువలేనిదన్నారు. ఆమె చేసిన త్యాగాలను స్మరిస్తు మహిళలు ముందడుగు వేయాలన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విజయ పాల డెయిరీలో తొలగించిన 9 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో రాయలసీమ విజయ పాల డెయిరీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పని చేస్తున్న కార్మికులకు ఎలాంటి సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోకపోతే ప్రజా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజుహుస్సేన్, ఖలందర్, శేఖర్, రవి పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నూతన విద్యా విధానం -2020 అమలును తక్షణమే రద్దు చేయాలని ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాస్త్రీయ, లౌకిక, ప్రజాతంత్ర, స్వతంత్ర విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. 3,4,5 తరగతుల విలీనం వలన విద్యార్థులు పాఠశాలలకు దూరమవుతున్నారన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కరెకృష్ణ, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, నాయకులు రత్నంఏసేపు, గట్టు తిమ్మప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర వీరభద్ర స్వామి దేవాలయం ఈవోగా గుర్రెడ్డి

కర్నూలు కల్చరల్: కల్లూరు ఈశ్వర వీరభద్ర స్వామి ఆలయం, భీమేశ్వర స్వామి ఆలయం ఈవోగా గ్రేడ్-1 ఈవో వై.గుర్రెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఈవోగా విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-1 ఈవో బి.ప్రసన్న లక్ష్మి 90 రోజుల పాటు చైల్డ్‌కేర్ లీవ్‌లో వెళ్లడంతో ఆమె స్థానంలో గుర్రెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుర్రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నంద్యాల జిల్లా నందికొట్కూరు గ్రూప్ టెంపుల్స్ ఎఫ్ఏసీ ఈవోగా దిన్నెదేవరపాడు గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్-1 ఈవో జి.కామేశ్వరికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

19న ఛత్రపతి శివాజీ జయంతి

కర్నూలు కల్చరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు బండిమెట్ట వీధిలోని అంబా భవాని ఆలయంలో నిర్వహిస్తున్నట్లు బాల శివాజీ యూత్ ప్రతినిధులు తెలిపారు. బండి మెట్ట వీధి నుంచి స్వామి వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్) వరకు శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్): డోన్ బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది పులి దామోదర్‌పై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడాన్ని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఆర్.కృష్ణ, కాటం రంగడు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. అందుకు నిరసనగా బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి, జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తామని పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, మైఖేల్, వాల్తేరు వీరయ్య, వారసుడు,సువర్ణ సుందరి, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మైఖేల్, రైటర్ పద్మ భూషన్, బుట్ట బొమ్మ
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, ది ఉమన్ కింగ్, రైటర్ పద్మభూషన్, రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం,పఠాన్, సువర్ణ సుందరి
భరత్ కాంప్లెక్స్ : రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం, పఠాన్, సువర్ణ సుందరి
రాజ్ : తెగింపు, బుట్ట బొమ్మ
శ్రీరామ : ప్రేమదేశం
విజయ : పఠాన్

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

- శిక్షణా తరగతులను తరచూ తనిఖీ చేయాలి
- పదిలో నూటికి నూరుశాతం పాస్ కావాలి
- సంక్షేమ హాస్టళ్ల అధికారులను ఆదేశించిన కలెక్టర్



సమీక్షకు హాజరైన అధికారులు,(ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): సంక్షేమ హాస్టళ్లలో పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంక్షేమ హాస్టళ్ల అధికారులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి రెమిడియల్ శిక్షణా తరగతులను పక్కాగా నిర్వహించాలన్నారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ హాస్టళ్లలోని 10వ తరగతి విద్యార్థులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన సబ్జెక్టులలోని మార్కుల ఆధారంగా వారిని విభజించుకోవాలన్నారు. ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి తగు శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణా తరగతులను ఉన్నతాధికారులు తరచూ తనిఖీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి పదవ తరగతి విద్యార్థులపై ఫోకస్ పెట్టాలన్నారు. నూటికి నూరు శాతం విద్యార్థులు పాస్ అవ్వాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ ఈడీ నాగేశ్వరరావు, మైనార్టీ సంక్షేమ అధికారి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు జరగకూడదు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఒక్క మాతా శిశు మరణం కూడా జరగకూడదని, ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మాతాశిశు మరణాలు, రక్తహీనత నివారణ, ఫ్యామిలి డాక్టర్ విధానం అంశాలపై వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల్లో జరిగిన రెండు మాతాశిశు మరణాలపై సమీక్షించారు. ఈ మరణాలకు సంబంధించి వైద్యుల వైపు నుంచి ఏవైనా పొరపాట్లు జరిగాయా, నిర్లక్ష్యం, అశ్రద్ధ ఏమైనా ఉందా అని మరణాలు సంభవించిన బంధువులు, ఆ ప్రాంతంలో ఉన్న పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో మాట్లాడారు. హైరిస్క్ గర్భిణులు, రక్తహీనత ఉన్న వారిపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న 19 ఏళ్లలోపు బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. తీవ్ర రక్తహీనత ఉన్న పిల్లలకు అన్ని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు వచ్చే మార్చి ఒకటో తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నామని, ఆ సమయంలో పిల్లలు బలంగా ఉండేలా మల్టీవిటమిన్ మాత్రలు, ఒక గ్లాసు పాలు అందించాలన్నారు. ఫ్యామిలి డాక్టర్ విధానం జిల్లాలో మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్యసేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాంజీనాయక్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజి హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.వెంకటరమణ, ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం ఆఫీసర్ డాక్టర్ బాలమురళి, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రాజెక్టు ఆఫీసర్ హేమలత, ఎన్‌హెచ్ఎం ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఉమా, ఐసీఎస్‌డీ పీడీ కుమారి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య, ఇతర అధికారులు

జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించనున్న 18వ జాతీయ స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జాతీయ పోటీల్లో పాల్గొంటున్న బాల బాలికలకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేడియం చీఫ్‌కోచ్ నటరాజరావు, శేషఫణీరాజు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే బాల్య వివాహాల నియంత్రణ

కర్నూలు(రాజ్‌విహార్): బాల్య వివాహాలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కర్నూలు జిల్లాధికారిణి కేఎల్ఆర్‌కే కుమారి సూచించారు. మంగళవారం స్థానిక బీ.క్యాంప్‌లోని కర్నూలు అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమష్టి కృషితోనే బాల్య వివాహాల నియంత్రణ సాధ్యమన్నారు. పోలీసు, రెవెన్యూ, చైల్డ్ లైన్, గ్రామ పంచాయతీ, విద్యా, కార్మిక, బాలల పరిరక్షణ, వైద్య ఆరోగ్య శాఖల సహకారంతో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చట్టం ప్రకారం కృషి చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ, మెప్మా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కర్నూలు సీడీపీఓ అనురాధ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్-9 వాణిజ్య సముదాయానికి నోటీసులు

కర్నూలు (టౌన్): నగరంలోని దేవనగర్‌లో ఉన్న ఎంఎస్ -9 వాణిజ్య సముదాయానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలంటూ మంగళవారం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, మన్సూర్, వాజిద్‌లు వెళ్లి బకాయిలు చెల్లించాలంటూ సీజ్ చేసే యత్నం చేశారు. ఇప్పటి వరకు 60 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.60 లక్షలు బకాయిలు యంఎస్-9 యజమానులు చెల్లించాల్సి ఉంది. అయితే వారం రోజులు గడువు ఇస్తే బకాయిలు చెల్లిస్తామంటూ లిఖితపూర్వకంగా రాసిచ్చారు.

తడి, పొడి చెత్త సేకరించాలి

కల్యాణ మండపాల నిర్వాహకులు చెత్త సేకరణ విషయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ చెప్పారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక కార్యాలయంలో కల్యాణ మండపాల నిర్వాహకులతో కమిషనర్ సమావేశం చెత్త నిర్వహణపై సూచనలు చేశారు. వ్యర్థాలను కొంత మంది పారిశుద్ధ్య సిబ్బంది పందుల యజమానులకు సరఫరా చేస్తున్నారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు అభినందన

కర్నూలు సిటీ: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన భారతి వారు సంయుక్తంగా ఇటీవలే నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యానగర్ మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈ మేరకు మంగళవారం ఆ స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.స్వర్ణలత ఆ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విజ్ఞాన్ మంథన్‌లో పి.మనోజ్ఞ(10వ తరగతి), బి.భవన(6వ తరగతి) ప్రథమ స్థానం, కె.దేవశ్రీ(10వ తరగతి) ద్వితీయ స్థానం, జశ్వంత్ రెడ్డి(9వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. విజేతలు ఈ ఏడాది మే నెల 21, 22 తేదీల్లో విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్ త్రివేంద్రం, కేరళలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల ట్రస్టుబోర్డుల్లో ఒక నాయీ బ్రాహ్మణునికి సభ్యునిగా అవకాశం కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం పట్ల జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ... సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జమ్ముల జనార్దన్, సంపత్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి ఎస్ ధన విజయుడు తదితరులు మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులను చులకనగా చూసిన గత పాలకులకు బుద్ధి వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు.



వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ నేతలు

కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం మద్దిలేటి, పోలీస్ వెంకటస్వామి, నాయీ బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షులు రాఘవేంద్ర, మధు, పెండేకల్ మద్దిలేటి, బీసీ జేఏసీ నాయకులు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మికాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల సాగును ప్రోత్సహించే విధంగా వ్యవసాయ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన విధంగా నెల వారీ కార్యక్రమాల ద్వారా చిరధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ప్రాధాన్యత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... రబీ పంటల నమోదులో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఏవో, ఏడీఏ, డీఏవోలు, ఆర్‌డీవోలు సూపర్ చెక్ నిర్వహించాలన్నారు. ఇంతవరకు సీహెచ్‌సీలు ఏర్పాటు కాని ఆర్‌బీకేల్లో మార్చి 3వ తేదీలోపు నెలకొల్పాలని సూచించారు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా పొలంబడి కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏవో పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్‌ఖాద్రీ, గిరీష్, సునీత, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీజగన్నాథ గట్టును కాపాడండి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు శివారులోని శ్రీలక్ష్మీజగన్నాథగట్టును కాపాడాలని విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ కోరారు. మంగళవారం వీహెచ్‌పీ నాయకులు కలెక్టర్ పి.కోటేశ్వరరావును కలిసి కొండపై ఆక్రమణలు జరుగుతున్నాయని, వాటిని నివారించాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

డీఏవో కార్యాలయం పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ మరమ్మతులకు నిధులు మంజూరైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఈ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించారు. దీనితోపాటు పశుసంవర్ధకశాఖ కార్యాలయాలు, జిల్లా నీటియాజమాన్య సంస్థ సమావేశ మందిరాన్ని కూడా పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం పూర్తిగా దెబ్బతినడంతో పూర్తి స్థాయి మరమ్మతుల కోసం వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ రూ.18.23 లక్షలు మంజూరు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు, సీపీవో అప్పలకొండ తదితరులు డీఏవో కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో చేపట్టాల్సిన మరమ్మతులను డీఏవో వరలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు.

'నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నాం'

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్శిటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల నియామకాలు, టైమ్ స్కేల్ అమలుపై జరుగుతున్న ప్రచారంపై చర్చించేందుకు మంగళవారం వర్శిటీ ఆవరణలో ఆర్‌యూ నాన్ టీచింగ్ టైమ్ స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శంకరయ్య, ఎల్.మీనాక్షి రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. యూనివర్శిటీ ఏర్పాటు చేసేందుకు ముందుగా ఉన్న పీజీ సెంటర్ నుంచి నాన్ టీచింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులలో చాలామంది తమ యొక్క పొలాలను యూనివర్శిటీ కోసం కోల్పోవడం జరిగిందన్నారు. వీరిపై కొందరు విద్యార్థి సంఘాల నాయకులు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను తాము అందరం ఖండిస్తున్నామన్నారు. అసోసియేషన్ నాయకులు పి.సుంకన్న, ఎం.నాగరాజు, ఎస్.లక్ష్మన్న పాల్గొన్నారు.

నగరంలో రహదారుల విస్తరణకు లైన్ క్లియర్

- ప్రభుత్వానికి విన్నవించిన కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- రూ. 16.23 కోట్ల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు (టౌన్): నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో రహదారుల విస్తరణకు లైన్ క్లియర్ అయ్యింది. కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ రహదారులను విస్తరించేందుకు నిధులు మంజూరు చేయాలంటే ప్రభుత్వానికి ఈ నెల 2వ తేదీన పూర్తి వివరాలు, నివేదికను సమర్పించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం నిధుల మంజూరుకు అంగీకరిస్తూ దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని తాజాగా మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, రహదారులు, భవనాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. రహదారులను బలోపేతం చేయడం, విస్తరించడం, ఆయా ప్రాంతాల్లో భవనాల యజమానులకు నష్టపరిహారంతో పాటు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కు నుంచి కలెక్టరేట్ కాంప్లెక్స్, కల్లూరు దర్వాజా, బుధవారపేట కిమీ 0/0 నుంచి 1/550 కిమీ వరకు రోడ్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, అలాగే పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి రాఘవేంద్ర మఠం వరకు విస్తరణకు రూ.6.23 కోట్లు, స్థానిక ఉస్మానియా కళాశాల నుంచి పూలబజారు వరకు రూ.6 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించి ఆయా ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేశారు. త్వరలోనే ఈ పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

హోమియో వైద్యుడికి జీనియస్ అవార్డు



డాక్టర్ అరుణ్‌ను అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ అరుణ్‌కు లండన్ ఇంటర్నేషనల్ జీనియస్ అవార్డు వరించింది. ఈ అవార్డును ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ఆయన హైదరాబాద్‌లో సంస్థ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బీఎన్ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. క్యాన్సర్ రోగులకు పాలియేటివ్ కేర్ చికిత్స ఇచ్చి వారి జీవితకాలాన్ని పెంచడం, స్వాంతన చేకూర్చడం, షుగర్, హార్ట్ ఫెయిల్యూర్ రోగులకు, కిడ్నీ, లివర్, మానసిక సమస్యలకు ఫార్ములా ప్రోటోకాల్ వైద్యాన్ని అందించారు. మంగళవారం ఆయనను కర్నూలులో మాజీ రాజ్యసభ్య సభ్యులు టీజీ వెంకటేష్ అభినందించారు.

సకాలంలో పాఠశాలకు రావాలి

కల్లూరు: ఉపాధ్యాయులు పాఠశాలలకు సకాలంలో హాజరుకావాలని మండల విద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ కస్తూరీ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించి ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన శరీన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

నాణ్యమైన విత్తనాలు సిద్ధం చేయండి

- డీఏఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి



జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఏపీ సీడ్స్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నాణ్యమైన విత్తనాలను సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు, జిల్లా డీఏఏబీ చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, ఏపీసీడ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావుకు సూచించారు. మంగళవారం ఆయన కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేటులోని ఏపీ సీడ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఏపీ సీడ్స్ చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఏపీ సీడ్స్ చేపడుతున్న కార్యక్రమాలు, విత్తనోత్పత్తి తదితర వాటిని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ మాట్లాడుతూ... రైతులు వ్యవసాయంలో రాణించాలంటే ప్రధానంగా నాణ్యమైన విత్తనం అవసరమని, సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాల్లో 100 శాతం నాణ్యత ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వేరుశనగలో అధిక దిగుబడులు సాధించడం కోసం వంద శాతం సబ్సిడీపై రైతులకు జిప్సమ్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. పచ్చిరొట్ట ఎరువులైన దయంచ, పిల్లిపెసర విత్తనాలకు ఇస్తున్న సబ్సిడీలను పెంచితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో ప్రధానంగా సాగు చేసే పత్తికి సంబంధించి వైఎస్ఆర్ అగ్రి ల్యాబ్‌ల్లో జన్యుపరమైన పరీక్షలు నిర్వహించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. మొదటిసారిగా ఏపీ సీడ్స్ కార్యాలయానికి వచ్చిన చైర్మన్ మహేశ్వరరెడ్డిని రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

నైపుణ్యాలు పెంచుకుని నేరాలు ఛేదించండి

కర్నూలు: కేసుల ఛేదనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన శిక్షణను పోలీసు అధికారులు విడతల వారీగా పొందుతున్నారు. ఏ ప్రాంతంలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయో అవగాహనతో వాటిని సమర్థవంతంగా ఛేదించేందుకు అవసరమైన నైపుణ్యాలపై డీటీసీలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా కాల్ డేటా రికార్డ్ ఎనాలసిస్ (సీడీఆర్) శిక్షణా కార్యక్రమం మొదటి బ్యాచ్ మంగళవారం ప్రారంభమయ్యింది. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సీడీఆర్ ఎనాలసిస్‌పై పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్క పోలీసు అధికారి ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాల్ డేటా రికార్డ్ ఎనాలసిస్, టవర్ లోకేషన్స్, సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తున్న విధానం, సైబర్ క్రైం, ఇతర సాంకేతికంగా నూతనంగా వచ్చిన అప్లికేషన్లపై అవగాహన పెంచుతూ పూర్తిస్థాయిలో శిక్షణనిస్తున్నామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసులను ఎఫ్ఐఆర్ దగ్గర నుంచి ఫైనల్ చార్జిషీటు నమోదయ్యేంత వరకు ప్రతి ఒక్క రికార్డు నమోదు చేస్తున్న విధానాన్ని ప్రతి అధికారి క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. డీఎస్పీలు వెంకటాద్రి, యుగంధర్ బాబు, వినోద్‌కుమార్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు శిక్షణలో పాల్గొన్నారు.



సీడీఆర్ ఎనాలసిస్ శిక్షణ కార్యక్రమంలో పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

'అప్పర్ భద్రపై బీజేపీ సమాధానం చెప్పాలి'

కర్నూలు(సిటీ): కర్ణాటక రాష్ట్రంలో కట్టబోయే అప్పర్ భద్ర వల్ల రాయలసీమ ఎడారి అవుతుందని తెలిసినా కూడా కేంద్ర ప్రభుత్వం రూ.5,300 కోట్లు కేటాయించిందని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ అన్నారు. మంగళవారం బిర్లా కాంపౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పర్ భద్ర నిర్మాణంపై రాయలసీమలో పర్యటిస్తున్న బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు సమాధానం చెప్పిన తర్వాతనే పర్యటించాలన్నారు. రాయలసీమలో కరువు పరిస్థితులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసన్నారు. తాగేందుకు నీరు కూడా చిక్కని ఈ ప్రాంతంపై శ్రద్ధ చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం కేవలం స్వార్థంతో బీజేపీకి అనుకూల ప్రాంతాల పట్ల ఒక వైఖరి, వారి పార్టీకి అనుకూలత లేని ప్రాంతాల్లో వివక్ష వైఖరి చూపుతోందన్నారు. సమావేశంలో మదాసి మదారి కురువ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు సుంకన్న, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు సాధించాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించాలని కర్నూలు నియోజకవర్గ టీడీజీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ అన్నారు. మంగళవారం స్థానిక టీజీ స్వగృహంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను అభినందించారు. జాతీయ పోటీల్లో పాల్గొంటున్న జైరామ్‌తేజ, లోకేష్ రెడ్డి, జ్యోతి, దినేష్, సుమంత్‌కుమార్, రయాన్‌బాష, ధనుంజయ్, జైద్‌బాషా, సాధుమాష, క్రాంతి కుమార్‌లకు ఆయన ఆర్థిక సాయం అందజేశారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ





శ్రీచైతన్య కాలేజీలో ఉత్తమ పర్సెంటైల్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం, జేఈఈ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో నారాయణ కాలేజీల కోర్ డీన్

కర్నూలు సిటీ: జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. కల్లూరు మండలం చిన్నటేకూరులో ఏపీ డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఉత్తమ పర్సెంటైల్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. వి.పవన్‌కుమార్ 96.61 పర్సెంటైల్, ఎం.అవన్‌కుమార్ 95.49, ఆర్.కిరణ్‌కుమార్ 95.39, చిన్నలింగప్పగారి ప్రవీణ్ 93.6, వై.తరుణ్ 91.8, సాకేటి కృపారావు 91.17, ఆర్.ఏ శ్రావణ్ 90.83, రెడ్డిపోగు రాజు 90.53, జంగం విద్యాసాగర్ 90.52 పర్సెంటైల్, 90కిపైగా 9 మంది, 80పర్సెంటైల్‌కి పైగా 18 మంది సాధించారన్నారు.

- జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సెంటైల్ సాధించినట్లు శ్రీచైతన్య జూనియర్ కాలేజీల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బి.జయసాయి 99.35 పర్సెంటైల్, ఎస్.రాహిల్ 99.16, పి.జోయెల్ 98.63, జె.అక్షయరావు 98.04, సి.సురేంద్ర 98.01, ఎం.విగ్నేష్ ప్రసాద్ 97.64, పి.కేథర్‌నాథ్ 96.83, ఆర్.చక్రధర్ 96.76, జే.దీపక్ 95.59, ఎం.రోహిత్ రెడ్డి 95.50, జి.చార్మిబాయి 95.12, బి.రోహిత్ 95.12 పర్సెంటైల్, 90కిపైగా 27 మంది పర్సెంటైల్ సాధించారన్నారు.
- జేఈఈ ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని ఆ కాలేజీల కోర్ డీన్ పి.లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎ.అనుగ్య 99.21 పర్సెంటైల్, ఇ.హరిణి 99.20, జె.పవన్ కుమార్‌రెడ్డి 98.84, కె.అబూబాకర్ సిద్దిక్ 98.79, సుధీర్‌కుమార్ 98.78, ఆర్.రిషింధర్ సింగ్ 98.75, ఎ.వెంకట సాయి శ్రీసాహితి 98.41, బి.మనోజ్‌కుమార్ 98.36, పి.హరిణి 98.06, ఆర్.నిహారిక 97.97, కె.విజయ్ తేజశ్విని 97.93, బి.విశ్వనాథ్ 97.86, కె.సాయిశ్రేష్ఠ 97.65, ఎస్.లాస్య 97.38, ఎం.సాయి మణిదీప్ 97.36, జి.సాయి అనన్య 97.28 పర్సెంటైల్, ఇంకా 96కిపైగా 22 మంది, 95కిపైగా 25 మంది, 90కిపైగా 69, 80కిపైగా 221, 70కిపైగా 423 మంది పర్సెంటైల్ సాధించారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలల విద్యార్థులను కాలేజీ అధ్యాపకులు తదితరులు అభినందించారు.